సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం ၊ 27 ၊ జూలై ၊ 2024



సోమశిలలో 9.620 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 9.620 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర కాలువ, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.70,310
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,348
3శాతం జీఎస్టీతో	రూ.6,538
సవర (8గ్రా)	రూ.52,304

గరిష్టం/కనిష్టం
36.0 /29.5

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. వాతావరణంలో తేమ 53 శాతం ఉంది.

న్యూస్‌రీల్

పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యం



ఎస్పీ కృష్ణకాంత్‌కు తమ సమస్యలను వివరిస్తున్న సిబ్బంది

నెల్లూరు సిటీ: జిల్లా పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ఎస్పీ జీ కృష్ణకాంత్ తెలిపారు. నగరంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీకి 24 మంది పోలీసులు తమ సమస్యలను స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

డీసీపల్లిలో 171 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం నుంచి లక్ష్యానికి మించి ఉత్పత్తి అయిన మిగులు పొగాకు రెండో విడత విక్రయాలు ప్రారంభించారు. తొలి రోజు 171 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 203 బేళ్లు రాగా వాటిలో 171 బేళ్లను విక్రయించామని మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 20711 కిలోల పొగాకు విక్రయించగా రూ.54,04,968 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.358 కాగా కనిష్ట ధర రూ.205 లభించింది. సగటు ధర రూ.260.96 నమోదైంది. వేలంలో 13 కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ హెలికాప్టర్ ట్రయల్ రన్



ఎయిర్ ఫోర్స్ అధికారులతో మాట్లాడుతున్న సదరన్ ఎయిర్ కమాండ్ చీఫ్ బాలకృష్ణన్

నెల్లూరు సిటీ: భారత వైమానిక దళానికి చెందిన సదరన్ ఎయిర్ కమాండ్ చీఫ్ బాలకృష్ణన్ మణికంఠన్ పర్యవేక్షణలో శుక్రవారం నెల్లూరులో హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. వైమానిక దళానికి చెందిన అధికారులు జిల్లాకు చేరుకుని స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సిగ్నలింగ్‌పై ట్రయల్ రన్ ద్వారా ఇక్కడి పరిస్థితులను అంచనా వేశారు.

80 టన్నుల ఇసుక డంప్ సీజ్

- రెండు టిప్పర్లు, జేసీబీ కూడా..



ఇసుక డంపింగ్ చేసిన ప్రాంతంలో విచారిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: మండలంలోని ఆకుతోటలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం వెనుక వైపు స్థలంలో కొందరు అక్రమంగా 80 టన్నుల ఇసుకను డంప్ చేశారు. ఇసుక కొరత ఏర్పడడంతో బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. శుక్రవారం రెండు టిప్పర్లకు జేసీబీ సహాయంతో ఇసుక లోడ్ చేస్తుండగా స్థానికులు నెల్లూరురూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఇసుక డంపింగ్‌కు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో ఇసుకతో పాటు రెండు టిప్పర్లు, జేసీబీని సీజ్ చేశారు. ఈ మేరకు డంపింగ్ నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

నెల్లూరు సిటీ: నగరంలోని స్టౌన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఉదయగిరి శ్రీనివాసులును శుక్రవారం సస్పెండ్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, కార్యాలయంలో సరిగా విధులు నిర్వహించకపోవడం, కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. జిల్లా రిజిస్ట్రార్ ద్వారా నివేదిక తెప్పించుకుని విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నిర్ధారణకు వచ్చి సస్పెండ్ చేశారు.

కాడి పట్టని కౌలు రైతు

- జిల్లాలో 5.6 శాతం మందికే కౌలు కార్డుల పంపిణీ
- ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా అందని కార్డులు
- బ్యాంకు రుణాల కోసం ఇబ్బంది పడుతున్న వైనం
- ప్రభుత్వం నుంచి అందని పంట సహాయం
- గత ప్రభుత్వంలో లక్ష్యానికి మించి సీసీఆర్‌సీల పంపిణీ

జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా.. కౌలు రైతు కాడి పట్టని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో సొంత భూమి కలిగిన రైతులతో పాటు కౌలు రైతులు ధీమాగా సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్యాంకర్లతో పాటు ప్రైవేట్ రుణదాతలు సైతం ముఖం చాటేయడంతో సాగుపై తర్జనభర్జన పడుతున్నారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు పెట్టుబడి సహాయం అందాలంటే కౌలు రైతుకు సీసీఆర్‌సీ (పంట సాగు హక్కు పత్రాలు) ముఖ్యం. గతేడాది లక్ష్యానికి మించి సీసీఆర్ కార్డులు అందజేస్తే.. ఈ ఏడాది ఇంత వరకు 6 శాతం మందికి కూడా అందజేయని పరిస్థితి. ఈ కార్డుల పంపిణీపై కూటమి ప్రభుత్వం నుంచి విధివిధానాలు ఇంకా రాకపోవడంతో వ్యవసాయ శాఖాధికారులు సైతం పట్టీపట్టనట్లు ఉన్నారు.



ఉదయగిరి/దుత్తలూరు: జిల్లాలో ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్ నాటికే కౌలు రైతులకు సీసీఆర్ (పంట సాగు హక్కు) పత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. గతేడాది వరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీసీఆర్‌సీ ఆధారంగానే కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకంతో పాటు సబ్సిడీ విత్తనాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, బ్యాంకు రుణాలు అందజేసింది. అయితే ఈ ఏడాది సీజన్ ప్రారంభమైనా కౌలు రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి భరోసా లభించలేదు. కొత్త ప్రభుత్వం నుంచి సీసీఆర్ కార్డుల పంపిణీపై ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో సంబంధిత వ్యవసాయశాఖాధికారులు సైతం సీసీఆర్‌సీ కార్డులు గత ప్రభుత్వంలో ఇచ్చినట్లు ఇచ్చేస్తే.. ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని భయంతో కాలయాపన చేస్తున్నారు. జిల్లాలో రబీ ప్రధాన సీజన్‌కు ఇంకా సమయం ఉందంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారు.

సీసీఆర్ కార్డులతో ప్రయోజనం

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అందజేస్తే పంట పెట్టుబడి కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లను సబ్సిడీపై పొందవచ్చు. పీఎం కిసాన్, గతంలో రైతు భరోసా, ప్రస్తుతం అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చు. పంట నష్టపోయిన సమయంలో పరిహారం పొందవచ్చు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులందరికీ ఇలాంటి ఎన్నో ప్రభుత్వ పథకాలు అందాయి. కొత్త ప్రభుత్వం రావడంతో ఈ ఏడాది సీసీఆర్ కార్డులు రైతులకు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం అలముకుంది.

కార్డుల పంపిణీలో జాప్యం

జిల్లా వ్యాప్తంగా కౌలు రైతు కార్డుల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 28 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు అందించాలని లక్ష్యం నిర్దేశించగా, అంతకు మించి 33 వేల మందికి అందించింది. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కౌలు రైతు కార్డులపై అంత సీరియస్‌గా తీసుకోలేదని రైతులు చెబుతున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 38,330 మందికి సీసీఆర్ కార్డులు అందజేయాలని లక్ష్యం కాగా గురువారం నాటికి 6,749 కార్డులు అంటే కేవలం 5.6 శాతం మాత్రమే పంపిణీ చేశారు. కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు మంజూరు చేస్తే రైతులతో పాటు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఇతర ఉపకరణాలు అందించాల్సి ఉంటుందని విధివిధానాల పేరుతో అటు ప్రభుత్వం కాలయాపన చేస్తుంటే.. సంబంధిత అధికారులు మాకెందుకు తలనొప్పి అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు అంతంతే

యజమానుల నుంచి భూములను కౌలుకు తీసుకుని రైతులు పంట సాగు చేస్తారు. భూమిపై వీరికి హక్కు లేకుండా కేవలం పండించే పంటకు మాత్రమే హక్కు కల్పిస్తూ సీసీఆర్ కార్డులను మంజూరు చేస్తున్నారు. అయితే దీనికి భూ యజమాని అనుమతి తప్పనిసరి. అయితే జిల్లాలో గ్రామ స్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ తూతూ మంత్రంగానే జరిగాయని పలువురు విమర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో విధి విధానాలు ఇంతవరకు స్పష్టం చేయకపోవడంతో ఇటు బ్యాంకర్లు, అటు ప్రైవేట్ రుణదాతలు రుణాలు ఇవ్వకపోవడంతో కౌలు రైతులు సాగుకు వెనుకడుగు వేశారు.


జిల్లాలో గతేడాది కౌలు కార్డులు లక్ష్యం :	పంపిణీ చేసిన కార్డులు :
28,000	33,000
ఈ ఏడాది లక్ష్యం: 38,330	ఇంత వరకు పంపిణీ : 6,749

వ్యవసాయ డివిజన్	లక్ష్యం	ఇప్పటి వరకు పంపిణీ
నెల్లూరు	11,581	2472
ఆత్మకూరు	7,699	1239
కావలి	11,392	2691
కందుకూరు	7,658	347



కౌలు రైతులకు అందజేసే సీసీఆర్ కార్డు

సకాలంలో కార్డులు మంజూరు చేయాలి



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలన్నర దాటుతున్నా ఇంత వరకు సగం కూడా కార్డులు మంజూరు చేయలేదు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా రైతుల సమస్యపై చర్చించ లేదు. కౌలు రైతులకు అందజేసే కార్డులపై విధివిధానాలు ప్రకటించలేదు. సకాలంలో సీసీఆర్‌సీలు ఇవ్వకపోతే అన్నదాతకు సబ్సిడీ విత్తనాలు, పంట రుణాలు, అన్నదాత సుఖీభవ అందే పరిస్థితి లేదు.

– సిద్ధు రామిరెడ్డి, ఉదయగిరి

సెప్టెంబర్ లోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తాం



సెప్టెంబర్ నాటికి సీసీఆర్ కార్డుల లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. జిల్లాలో సీసీఆర్ (పంట సాగు హక్కు) కార్డుల పంపిణీ కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. లక్ష్యాన్ని చేరుకోవాలని వ్యవసాయ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. జిల్లాలో రబీలోనే అత్యధిక శాతం మంది రైతులు పంటలు సాగు చేస్తారు. ప్రస్తుత ఖరీఫ్‌లో కొంత మేర మాత్రమే సాగు చేస్తారు. కార్డుల పంపిణీ వేగవంతం చేస్తాం.


– సత్యవాణి, జేడీఏ, నెల్లూరు

పోస్టింగ్‌లకు పైరవీలు

'ఇటీవల జిల్లా స్థాయి అధికారిణి ఒకరు మంత్రి నారాయణను ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. సార్.. మీతో పర్సనల్‌గా మాట్లాడాలని ఆమె చెప్పడంతో ఆ గదిలో ఉన్న మంత్రి అనుచర వర్గం, ఆయన వ్యక్తిగత సిబ్బంది బయటకు వెళ్లారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోనే పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నాను. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా జిల్లాలోనే పనిచేసే అవకాశం కల్పిస్తే మీరు చెప్పినట్లు నడుచుకుంటా? మీ కనుసన్నల్లో పనిచేస్తా అని చెప్పడంతో మంత్రి నారాయణ అలాగే పనిచేసుకో పో అంటూ హామీ ఇచ్చారట'

- మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం ప్రదక్షిణ
- మండలం నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు క్యూ
- పోలీసుల జాబితా రెడీ చేసి రెడ్‌బుక్ స్క్రీనింగ్ కోసం పంపిన వైనం

కోరిన చోటుకు బదిలీ చేస్తే అడిగినంత ఇచ్చుకుంటాం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లా స్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు అందరికీ బదిలీల ఫీవర్ పట్టుకుంది. తాము కోరుకున్న ప్లేస్ కోసం అధికారులు, ఉద్యోగులు, పోలీసులు ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. నేరుగా కలిసేందుకు వీలు కాకపోవడంతో మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్నిహితులుగా ఉండే వారితో టచ్‌లోకి వెళ్లి పోస్టును బట్టి రేటును కూడా మాట్లాడుకుని ఓకే చేయించుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు తమ పోస్టింగ్‌లకు ఓకే చెప్పించుకుని ఇక బదిలీల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు.

జిల్లా స్థాయి పోస్టులకు డిమాండ్

రాష్ట్ర వ్యాప్తంగా కీలకమైన ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు పూర్తయ్యాయి. జిల్లాలకు నూతన కలెక్టర్లు, ఎస్పీలు వచ్చేశారు. ఇక జిల్లా స్థాయి అధికారుల నుంచి డివిజన్, మండలస్థాయి అధికారుల బదిలీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. అధికారుల బదిలీల్లో జాప్యం జరుగుతుండడంతో కోరుకున్న పోస్టింగ్ కోసం కొందరు ప్రజాప్రతినిధుల కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ప్రస్తుతం జిల్లా స్థాయి అధికారుల పోస్టింగ్‌కు డిమాండ్ ఏర్పడింది. అక్రమార్జన బాగా ఉండే శాఖ కోసం పైరవీలు జోరుగా సాగుతున్నాయి. డ్వామా, డీఆర్‌డీఏ, నుడా వీసీ, డీపీఓ, డీఈఓ, ఎస్ఎస్ఏ, ఐటీడీఏ పీఓ, అన్ని ఇంజినీరింగ్ శాఖల ఎస్ఈలు, జెడ్పీ సీఈఓ, అన్ని కార్పొరేషన్ల ఈడీల పోస్టుల కోసం అధికారులు ప్రయత్నిస్తున్నారు. అందులో కూడా అడ్డదారిలో నోట్ల కట్టలు బాగా వచ్చే శాఖల కోసం ఎగబడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల కంటే వారి సన్నిహితుల వద్దే అధికారులు కనిపిస్తున్నారు. ఎలాగైనా ఆ పోస్టు తనకే రావాలని అందుకు తగిన విధంగా ప్రతిఫలం సమర్పించుకోవడంతో పాటు మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటామని చెపుతున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయి అధికారుల పోస్టులకు జిల్లాలోని ఇద్దరు మంత్రులతో పాటు ఎమ్మెల్యేల ప్రాపకం కోసం పాకులాడుతున్నారు. వారిలో మెజార్టీ సభ్యుల సూచనల మేరకే పోస్టింగ్ ఉంటుందని చెప్పడంతో అందరి చుట్టూ తిరగాల్సి వస్తోంది.

డివిజన్ స్థాయిలోనూ అంతే..

డివిజన్ స్థాయిలో ఆర్డీఓల పోస్టింగ్‌కు భలే గిరాకీగా ఉంది. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్డీఓలు ప్లేస్ మారి జిల్లాలోనే ఉండేందుకు మంత్రులు, ఎమ్మెల్యేల ప్రాపకం కోసం తిరుగుతున్నారు. ప్రభుత్వం మార్పుతోనే అధికారుల పనితీరు మారిపోయింది. ఒక్కసారిగా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే వారు నడుచుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల సన్నిహితులతో మరొక్కసారి అవకాశం ఇవ్వమని ప్రాధేయపడుతూనే పోస్టుకు తగినట్లుగా ముడుపులు ఇచ్చుకుంటామని చెబుతున్నారు. ఇక మండల తహసీల్దార్లు తిరిగి సొంత జిల్లాకు వచ్చేశారు. చేతి నిండా కట్టలు వచ్చే మండలాల పోస్టింగ్‌కు డిమాండ్ పెరిగింది. దీంతో ఎమ్మెల్యేల సిఫార్సుల కోసం ఎగబడుతున్నారు. తహసీల్దార్లు సొంత డివిజన్లలో పనిచేయకూడదనే నిబంధనలు ఉండడంతో ఎవరెవరు ఏ డివిజన్‌కు చెందిన వారో జాబితా తయారు చేసి కలెక్టర్ కార్యాలయం అధికారులకు ఎమ్మెల్యేలకు ఇచ్చేశారు. ఇక వారు చెప్పిన వారికే ఆ మండల తహసీల్దార్లుగా పోస్టింగ్‌లు ఇచ్చేలా జాబితా తయారవుతుందని సమాచారం.

సమన్వయం అంటూనే..

జిల్లా అధికారుల పోస్టింగ్‌ల కోసం జిల్లాలోని ఇద్దరు మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు సమన్వయంతో ఎంపిక చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం మంత్రి నారాయణ నివాసంలో సమావేశమై అధికారుల జాబితాను అందరు కలిసికట్టుగా తయారు చేయాలని తీర్మానించుకుని ఎవరికి వారు తమ ఇష్టులను తెరపైకి తెచ్చారు. ఆ జాబితాను రెడీ చేసి స్క్రీనింగ్ టెస్ట్ కోసం పంపనున్నట్లు తెలిసింది.

పోలీసుల జాబితా రెడీ

జిల్లాలో డివిజన్ స్థాయి, సీఐలు, ఎస్ఐల పోస్టింగ్‌లు జాబితా రెడీ అయినట్లు సమాచారం. నెల్లూరు రూరల్, నెల్లూరు నగరం, కావలి, ఆత్మకూరు డీఎస్పీలు పోస్టింగ్‌ల కోసం జిల్లా మంత్రులతో పాటు ప్రభుత్వ పెద్దల సిఫార్సు వరకు వెళ్లింది. నెల్లూరు రూరల్ పోస్టుకు డిమాండ్ బాగా ఉండడంతో గతంలో నెల్లూరులో సీఐగా పనిచేసి వెళ్లిన అధికారి డీఎస్పీగా వస్తున్నట్లు సమాచారం. నెల్లూరు నగర డీఎస్పీగా పనిచేస్తున్న అధికారి ఇక్కడే ఉండేందుకు ఎక్కిదిగని మెట్లులేవు. ఇప్పటికే అధికార పార్టీ నేతల కరుణ కోసం పడరానిపాట్లు పడుతున్నారు. ఇక సీఐల జాబితా కూడా రెడీ అయిందని తెలుస్తోంది. ఎమ్మెల్యేల సిఫార్సుల మేరకే పోస్టింగ్‌లు ఉంటాయని ఆదేశాలు రావడంతో వారి ప్రాపకం కోసం చేయని పనిలేదు. వన్‌సైడ్‌గా పనిచేస్తామని చెప్పడమే కాకుండా పోస్టుకు తగినట్లుగా సమర్పించుకునేలా వ్యవహారాలు జరుగుతున్నాయి. జాబితా రెడీ చేసి లోకేశ్ రెడ్‌బుక్‌లో స్క్రీనింగ్ కోసం పంపినట్లు సమాచారం.

బీద రవిచంద్ర పెత్తనం

జిల్లా టీడీపీలో కీలక నేతగా ఉన్న ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర జిల్లా అడ్మినిస్ట్రేటివ్‌లో ప్రధాన పాత్ర పోషించేలా పార్టీ అధిష్టానం ఇప్పటికే సందేశం పంపింది. జిల్లా అధికారుల జాబితా నుంచి అన్ని విషయాల్లో బీద సూచనలతోనే రావాలని సందేశం రావడంతో జిల్లా ప్రజాప్రతినిధులు మాత్రం లోలోన రగిలిపోతున్నారు. ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేగా ఎన్నికయిన తమను కాదని జిల్లాలో బీద పెత్తనం ఏమిటంటూ కొందరు మండిపడుతున్నారు. కానీ పార్టీ అధిష్టానం సూచన కావడంతో ఎదురు ప్రశ్నించలేక మదనపడుతున్నారు.



ఆత్మకూరు చెరువులో మట్టిని యంత్రంతో తవ్వి టిప్పర్లో లోడ్ చేస్తున్న దృశ్యం

మట్టి మాఫియా దందా

- రైతుల అవసరాల కోసమని ఇరిగేషన్ శాఖ వద్ద అనుమతులు
- ఇటుక బట్టీలు, రియల్ వెంచర్లకు తోలకం
- రోజూ 50 వాహనాల్లో తరలింపు
- రోజుకు రూ.10 లక్షల సంపాదన
- ఆత్మకూరు పట్టణ టీడీపీ నేత కనుసన్నల్లో దోపిడీ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరులో టీడీపీ నేతలు సహజ వనరులను దోచేస్తున్నారు. మట్టి, ఇసుక, గుల్ల ఇసుక ఏదీ వదలడం లేదు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు నుంచే మర్రిపాడులో ఇసుక డంపింగ్‌పై పడి రూ.10 కోట్ల విలువైన ఇసుక దోచుకున్న పచ్చ నేతలు తాజాగా ఆత్మకూరు చెరువు మట్టిని తోడేస్తున్నారు. రైతుల అవసరాల కోసమని ఇరిగేషన్ అధికారులు నుంచి అనుమతులు తీసుకుని రియల్ వెంచర్లు, ఇటుక బట్టీలకు మట్టి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాయల కాలం నాటి ప్రాముఖ్యత ఉన్న ఆత్మకూరు చెరువు 968 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఆ చెరువు కింద 6,500 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఆత్మకూరు, నువ్వూరుపాడు, జంగాలపల్లి, అల్లీపురం, రావులకొల్లు గ్రామాల భూములకు ఈ చెరువు నీరే ఆధారం. చెరువులో నిక్షిప్తమైన సారవంతమైన మట్టిని సాగు భూములకు తోలుకుంటే భూమి మరింత సారవంతమయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో చెరువు మట్టిని రైతుల భూములకు తోలేందుకు ఇరిగేషన్ శాఖ అనుమతులిచ్చే ఆవకాశం ఉంది. ఈ అవకాశాన్ని ఆత్మకూరు పట్టణ టీడీపీ నేతలు తమ ఆదాయ వనరులుగా మార్చేసుకున్నారు. చెరువు మట్టిని వెంచర్లతో పాటు ఇటుక బట్టీలకు తోలడం శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభించారు.

నిత్యం 50 టిప్పర్లతో.. రూ.10 లక్షలు సంపాదన

చెరువులో భారీ యంత్రాలు పెట్టి మట్టిని తవ్వేస్తున్నారు. రోజుకు 50 టిప్పర్ల మట్టిని అమ్మేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు నిబంధనలకు విరుద్ధంగా 30 టన్నుల మట్టి నింపుతున్నారు. ఆ వాహనం మట్టి విలువ రూ.19 వేలు వంతున ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం చేజర్ల మండంలోని రియల్ వెంచర్లకు తోలకాలు చేస్తున్నారు. ఇటుక రాయి తయారీకి జిగురు ఉన్న మట్టి కావడంతో ఇటుక బట్టీ యజమానులు ఆ మట్టిని కొనుగోలు చేస్తున్నారు. చేజర్ల, మర్రిపాడు, అనంతసాగరంతో పాటు కలువాయి మండలం వరకు ఆత్మకూరు చెరువు మట్టి విక్రయాలు జరుగుతున్నాయి.

అధికారులకు వాటాలా?

చెరువు నుంచి తరలిస్తున్న మట్టి ఏ రైతు పొలానికి తోలుతున్నారో తెలియజేయాల్సి ఉంది. ఈ నిబంధనలు పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవసాయ భూములకని మట్టిని తరలిస్తుంటే.. ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారు. సదరు టీడీపీ నేతల అక్రమ సంపాదనలో వాటాలు తీసుకుంటూ మట్టి దందాకు మద్దతుగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఓటర్ల జాబితా చట్టబద్ధంగా తయారు చేయాలి



శిక్షణ ఇస్తున్న డీసీఓ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): పీఏసీఎస్‌ల్లో ఓటర్ల జాబితా చట్టబద్ధంగా తయారు చేయాలని జిల్లా సహకారశాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప తెలిపారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని డీసీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా జిల్లాలోని పీఏసీఎస్ సీఈఓలకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఓటు హక్కుకు అర్హత పొందిన సభ్యుల జాబితాను ఏపీ సహకార సంఘాల చట్టం 1964 సెక్షన్ 25, రూల్ 18 సెక్షన్ 115–డీ అనుసరించి చట్టబద్ధంగా జాబితాను తయారు చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు ఎరువుల సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ నిధులతో నిర్మించిన 43 బహుళ ప్రయోజన సేవల గోదాములను రైతులకు అందుబాటులో తీసుకురావాలన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సమస్యలతో ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణం


వెంకటసుధీర్ (ఫైల్)

అనుమసముద్రంపేట: ఆర్థిక సమస్యలతో ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుప్పురుపాడులో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలచీరు వెంకటేశ్వర్లు, కృష్ణవేణి దంపతుల కుమారుడు వెంకటసుధీర్ (38) కొన్ని సంవత్సరాలుగా నెల్లూరు పోలీస్ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. నెల్లూరులోనే కాపురముంటున్నాడు. ఆర్థిక పరిస్థితులు దిగజారడంతోపాటు ఇటీవల ఆరోగ్యం బాగోలేకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ నేపథ్యంలో బుధవారం కుప్పురుపాడుకు బయలుదేరాడు. గ్రామ సమీపంలోకి రాగానే పురుగు మందు తాగి ఇంటికి వెళ్లాడు. అది గమనించిన తండ్రి వెంకటేశ్వర్లు సుధీర్‌ను వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు, అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ రవినాయక్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

వెంకటాచలం: ఓ వ్యక్తి పొలాలకు వేసే గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గొలగమూడి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వావిళ్ల శ్రీనివాసులు (28) స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య నాలుగు నెలల క్రితం మరణించింది. కుమారుడు ఉన్నాడు. ఏమి జరిగిందో తెలియదు గానీ శ్రీనివాసులు గురువారం బయటకు వెళ్లాడు. కాసేపటికి ఇంటికి వచ్చి వాంతులు చేసుకోసాగాడు. కుటుంబసభ్యులు అడగ్గా గుళికలు తిన్నానని చెప్పడంతో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


నరసింహ ప్రసాద్ మృతదేహం

మనుబోలు: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెందిన ఘటన మండల పరిధిలోని లక్ష్మీనరసింహాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుమ్మూరు నరసింహ ప్రసాద్ (47)కు వివాహమై ఇందుప్రియ, ప్రణీత్‌శ్రీ అనే ఇద్దరు పిల్లలున్నారు. కాగా ప్రసాద్‌కు కొంతకాలంగా మానసికస్థితి సరిగ్గా లేదు. ఈ క్రమంలో గ్రామంలోని ఉప్పలపాటి వారి బావిలో శవమై కనిపించాడు. ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడా?, లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అనే విషయం తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేబీ డిగ్రీ కళాశాలను సందర్శించిన వీసీ


వీసీని సన్మానిస్తున్న అధ్యాపకులు తదితరులు


కావలి: స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలను విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో విద్యా సంబంధిత విషయాలపై సమీక్షించారు. కళాశాలలోని ముఖ్యమైన విభాగాలు, ఇండోర్ స్టేడియం, క్రీడా మైదానం, జేబీ గార్డెన్లను పరిశీలించారు. విశ్వోదయ వ్యవస్థాపకులైన డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి కృషిని, అంకితభావాన్ని కొనియాడారు. అనంతరం వీసీని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మల్యాద్రి పాల్గొన్నారు.

కండలేరులో 6.202 టీఎంసీలు


రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.202 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్య సాయిగంగ కాలువకు 140, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:115
లేయర్ (లైవ్)	:100
బ్రాయిలర్ చికెన్	:210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:234
లేయర్ చికెన్	:170



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	:రూ.55
సన్నవి	:రూ.35
పండ్లు	:రూ.25

ప్రభుత్వం మాదే.. తవ్వేస్తాం

అధికారంలోకి రావడమే ఆలస్యం తెలుగుదేశం నాయకులు అక్రమాలకు తెరలేపారు. బోగోలు మండలంలో ప్రకృతి వనరులను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. పట్టపగలే ఈ తంతు జరుగుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు ఉన్నారనే విమర్శలున్నాయి.

బోగోలులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- తెలుగు తమ్ముళ్ల ఇష్టారాజ్యం
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం


కొండబిట్రగుంటలో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలు

బిట్రగుంట: బోగోలు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీ నాయకులే రైతుల పేరుతో చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు వినియోగించి వాణిజ్య అవసరాల కోసం గ్రావెల్‌ను తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

ఎక్కడంటే..

బోగోలు, ముంగమూరు చెరువుల్లో వారం రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ కారణంగా గోతులు ఏర్పడి భవిష్యత్‌లో ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. నాడు టీడీపీ హయాంలో గ్రావెల్ కోసం తీసిన గోతుల్లో పడి పలువురు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు గుర్తు చేస్తున్నారు. అదే విధంగా చెరువుల్లోకి వెళ్లే గేదెలు కూడా ప్రమాదాలబారిన పడుతున్నాయని వాపోతున్నారు. బోగోలు, ముంగమూరు చెరువులతోపాటు ప్రసన్న వేంకటేశ్వరస్వామి కొలువైన కొండబిట్రగుంటలోనూ యథేచ్ఛగా గ్రావెల్‌ను కొల్లగొడుతున్నారు. పెద్ద జేసీబీలతో గ్రావెల్‌ను తవ్వి పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారుల కళ్లెదుటే అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత విభాగాలు నోరుమెదపకపోవడం గమనార్హం.

వివరాలు సేకరిస్తున్నాం

బోగోలు, ముంగమూరు చెరువుల్లో గ్రావెల్ తరలిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. ముంగమూరులో రైతుల అనుమతి తీసుకుని తవ్వకాలు నిర్వహిస్తున్నారు. బోగోలు చెరువుల్లో అక్రమ తవ్వకాలు జరుగుతుంటే అడ్డుకుంటాం. పూర్తి వివరాలు సేకరిస్తున్నాం.

– జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ

వారికే వత్తాసు

టీడీపీ నాయకులు ఇష్టారీతిగా తవ్వకాలు చేస్తూ చెరువులు, చెరువు పోరంబోకు భూములను నాశనం చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. పైపెచ్చు సదరు వ్యక్తులకే వత్తాసు పలుకుతున్నారంటూ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు కూడా తవ్వకాల వైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వితే మైనింగ్ అధికారులతోపాటు రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి వాహనాలు సీజ్ చేసేవారు. భారీ ఎత్తున జరిమానాలు విధించడంతోపాటు మళ్లీ తవ్వకాలు నిర్వహించకుండా రెవెన్యూ అధికారులు వీఆర్‌ఏలను కాపలాగా ఉంచేవారు. ప్రస్తుతం మాత్రం తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా అక్రమ తవ్వకాల్లో అధికారులు కూడా తమ వాటా అందుకుని మౌనంగా ఉంటున్నారు.

సంగంలో వరుస చోరీలు

- తాజాగా రెండు గృహాల్లో నగదు, బంగారం అపహరణ
- నాలుగుచోట్ల చోరీకి యత్నం


రమాదేవి నివాసంలో విచారిస్తున్న సీఐ, ఎస్సైలు

సంగం: మండల కేంద్రమైన సంగంలో వరుస చోరీలు ప్రజలను హడలెత్తిస్తున్నాయి. తాజాగా రెండు గృహాల్లో రూ.80 వేల నగదు, రెండు సవర్ల బంగారం అపహరణకు గురైంది. మరో నాలుగుచోట్ల చోరీ యత్నాలు జరిగాయి. పోలీసుల కథనం మేరకు.. సంగం శివాజీ సెంటర్‌లో నివాసముంటున్న కాకు రమాదేవి గురువారం రాత్రి భోజనం చేసి ఇంటికి తాళాలు వేసి పక్కనే ఉన్న కుమారుడు మురళి ఇంటికి వెళ్లి నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ.60 వేల నగదు, రెండు సవర్ల విలువైన బుట్టకమ్మలు, చైన్‌ను ఎత్తుకెళ్లారు. సంగం గురుకుల కళాశాల సమీపంలో నివాసముంటున్న పి.సురేఖ ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టి రూ.20 వేల నగదును దోచుకెళ్లారు. సమాచారం అందుకున్న సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి ఆయా గృహాలను పరిశీలించారు. క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. అదే విధంగా కొత్తూరులోని ఓ వీధిలో ఇళ్ల తలుపుల తాళాలను దొంగలు పగులగొట్టారు. రెండు ఖాళీగా ఉండడం, మరో రెండుచోట్ల విలువైన వస్తువులు లేకపోవడంతో వెళ్లిపోయారు. దీంతో వారు ఫిర్యాదు చేయలేదని ఎస్సై తెలిపారు. గత నెలలో కూడా ఒకేరోజు ఆరు గృహాల్లో దొంగతనాలు జరిగాయి. రూ.1.30 లక్షల నగదు, 8 సవర్ల బంగారాన్ని అపహరించారు. ఈ ఘటన మరువక ముందే మరోసారి దొంగలు హల్‌చల్ చేయడంతో సంగం ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దుండగులు పగలంతా రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.

పిల్లలు పుట్టడానికి మందు ఇస్తామంటూ..

- రూ.40 వేల దోపిడీ

అల్లూరు: పిల్లలు పుట్టడానికి మందు ఇస్తామని ఇద్దరు వ్యక్తులు మోసం చేసి రూ.40 వేలను దోచుకెళ్లిన ఘటన అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లి బీఎంఆర్ ఆర్చ్ వద్ద శుక్రవారం జరిగింది. అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి వివరాలు వెల్లడించారు. బోగోలు మండలం తాటిచెట్లపాలేనికి చెందిన వావిళ్ల శీనయ్యకు వివాహమై ఏడు సంవత్సరాలైంది. అయితే సంతానం లేదు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అతడిని కలిసి పిల్లలు పుట్టడానికి మందు ఇస్తామని చెప్పారు. అయితే శీనయ్య వారిని నమ్మకుండా తనకు మెడికల్‌షాపును చూపించాలని, అక్కడే మందులు తీసుకుంటానని చెప్పాడు. సదరు వ్యక్తులు షాపు చూపిస్తామని చెప్పారు. శీనయ్య తన అక్క బంగారమ్మతో ఒక బైక్‌పై, ఆ ఇద్దరూ మరో బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో ఇస్కపల్లి బీఎంఆర్ ఆర్చ్ వద్దకు రాగా బంగారమ్మ వద్ద ఉన్న రూ.40 వేలను ఇవ్వాలని దుండగులు డిమాండ్ చేయగా ఆమె ఒప్పుకోలేదు. దీంతో బెదిరించి నగదు లాక్కొని పరారయ్యారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'అవినీతికి పాల్పడలేదు'

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడ కామాక్షితాయి ఆలయాన్ని అభివృద్ధి చేశానే తప్ప అవినీతికి పాల్పడలేదని మాజీ చైర్మన్ పుట్టా లక్ష్మి సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన బుచ్చిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విచ్చలవిడిగా ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కుంకుమార్చన, మహా కుంభాభిషేకం కార్యక్రమాల్లో అవినీతి జరగలేదన్నారు. దాతల సహకారం, అధికారుల అనుమతితో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుత ఈఓ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు నగదు లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మూడు రోజులపాటు విచారణ చేయించారని తెలియజేశారు.

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు


ఆత్మకూరు: రికార్డులు చూస్తున్న రాములు


పొదలకూరు: పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ

ఆత్మకూరు: ఆత్మకూరు సబ్ డివిజన్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, బైపాస్‌రోడ్డుల్లో అదే క్రమంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై పలుచోట్ల వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న వారికి రూ.1,51,000 జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ధ్రువీకరణపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. సరైన పత్రాలు, హెల్మెట్ లేని వాటికి రూ.2 వేల చొప్పున జరిమానా వేశామన్నారు. రెండు వేల వాహనాలు పెనాల్టీ చెల్లించకుండా తిరుగుతున్నాయన్నారు. సదరు వాహనదారులు వెంటనే స్పందించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

రూ.2 లక్షల జరిమానా

పొదలకూరు: సరైన పత్రాల్లేకుండా తిరుగుతున్న వాహనాలను నెల్లూరు ఎంవీఐ బాల మురళీకృష్ణ శుక్రవారం సీజ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. 15 వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి రూ.2 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ నెల్లూరు ఉప రవాణా శాఖ కమిషనర్ చందర్ ఆదేశాల మేరకు పదిహేను రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రెండు బైక్‌ల సీజ్

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలో ఆర్టీఓ పూర్ణచంద్రరావు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు బైకులను సీజ్ చేయడం జరిగిందని అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో ఒక్కో వాహనానికి రూ.5,200 జరిమానా విధించారన్నారు.

విద్యార్థి తండ్రిపై దాడి


గాయపడిన బుజ్జిరెడ్డి

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని అలుగువాగు సమీపంలో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది విద్యార్థి తండ్రిపై దాడి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. ఈ విషయమై బాధితుడు సోమశిల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులోని వివరాల మేరకు.. బుజ్జిరెడ్డి కుమార్తె లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో చదువుతోంది. శుక్రవారం అతను ఫీజు కట్టేందుకు వెళ్లాడు. తన కుమార్తెకు చదువు రావడంలేదని, మీరు పాఠాలు బాగా చెబుతున్నారా? లేదా? అని ప్రశ్నించాడు. దీంతో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున దురుసుగా ప్రవర్తించి మేము చదువు చెప్పకపోతే.. మీ ఇష్టం వచ్చినచోట చెప్పుకోవాలని, టీసీ ఇచ్చి పంపిస్తామన్నాడు. అంతటితో ఆగకుండా అతను, సిబ్బంది కలిసి తనపై దాడి చేశారని బుజ్జిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై హెచ్‌ఎం మల్లికార్జున మాట్లాడుతూ పాఠశాల మొదలై రెండు నెలలు కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు కట్టమని ఫోన్లు చేస్తున్నామన్నారు. బుజ్జిరెడ్డికి కూడా కాల్ చేశామన్నారు. ఆయన పాఠశాలకు వచ్చిఇష్టానుసారంగా మాట్లాడి దాడి చేయడంతో మా సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారితో కూడా దురుసుగా ప్రవర్తించాడన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొడిగింపు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పథకాన్ని 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి పొడిగించిందని సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలియజేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్యసేవలు పొందవచ్చన్నారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని డీడీ వెల్లడించారు.

నిమ్మ మార్కెట్‌కు నాణ్యత లేని కాయలు

పొదలకూరు: నిమ్మ మార్కెట్‌కు నాణ్యత లేని కాయలను తరలిస్తుండడంతో స్వల్పంగా ధరలు తగ్గుతున్నట్లు వ్యాపారులు తెలిపారు. రెండురోజుల క్రితం వరకు కిలో నిమ్మకాయల ధర రూ.45 నుంచి రూ.65 ఉండగా ప్రస్తుతం రూ.35 నుంచి రూ.55లు ఉంది. ఈ సీజన్లో అత్యధికంగా రూ.65 వరకు ధర పలికినట్లు వ్యాపారులు వెల్లడించారు. లూజు (బస్తా) లెక్కన పరిశీలిస్తే టాప్ రూ.5,400 వరకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. అయితే తోటల్లో దిగుబడి పెరగడంతోపాటు నాణ్యత లేని కాయలు వస్తుండడంతో ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. సాధారణంగా రైతులు ఐదునెలలకు కాయలను కోయాల్సి ఉంటుంది. అయితే ఆరునెలల తర్వాత కోసి మార్కెట్‌కు తరలించడంతో నాణ్యత లోపిస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. దీనికితోడు వాతావరణంలో మార్పులు, చివరి కాపు తదితర కారణాలతో ధరలు పతనమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ధరలు తక్కువేమీ కాదు. జూలై నెలలో ఈ మాత్రం ధరలు పలుకుతున్నాయంటే రైతులకు గిట్టుబాటు అవుతున్నట్టేనని మార్కెట్ నిర్వాహకులు వెల్లడిస్తున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

కలిగిరి: రక్షణ కల్పించాలని కోరుతూ ఓ ప్రేమజంట శుక్రవారం కలిగిరి పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తూర్పుగుడ్లదొనకు చెందిన యువతి, కొండాపురం మండలం పార్లపల్లికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారు. మూడు రోజుల క్రితం పెళ్లి చేసుకున్నారు. ఇద్దరూ రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరి సామాజికవర్గాలు వేరు. కుటుంబసభ్యులు, బంధువులు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. యువతిని తీసుకెళ్లిపోవాలని ఆమె కుటుంబం ప్రయత్నించగా ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మేజర్లు కావడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సర్దిచెప్పారు.

ఆకుముడత తెగులుపై అప్రమత్తత అవసరం


వరిపైరును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి

కోవూరు: వరిసాగు చేస్తున్న రైతులు ఆకుముడత తెగులుపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని లేగుంటపాడులో శుక్రవారం వరి పొలాలను ఆమె సందర్శించారు. అనంతరం కౌలు రైతులకు గుర్తింపుకార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటకు ఆకుముడత తెగులు సోకిందని గుర్తించామన్నారు. వరిపైరు వయస్సు 75 రోజులు దాటితే పురుగు ఉధృతిని బట్టి వ్యవసాయ అధికారుల సూచనలతో మందులు వాడాలని సూచించారు. లేత దశలో ఆకుముడత, మోమిపిప్పి తెగుళ్లు పంటకు ఆశిస్తాయని, ఆ సమయంలో వేప కషాయం 0.5 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ సుజాత, ఏఓ ఇందిరావతి, వీఆర్వో నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.